క్లుప్తంగా

పోలింగ్ కేంద్రం పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): త్వరలో జరగనున్న గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ గ్రేస్‌బాయి, ఏఎస్‌ఐ సునీత మంగళవారం పరిశీలించారు. పేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలింగ్ కేంద్రంలో అన్ని వసతులను ఏర్పాటు చేస్తున్నామని వారు తెలిపారు. దీంతో పాటు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం.చంద్రప్రకాష్, రామకృష్ణాగౌడ్, సంతోష్, సిబ్బంది బాగయ్య ఉన్నారు.

ఉచిత వైద్యంతో పేదలకు మేలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లో ఉచిత వైద్యం అందించడంతో పేదలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ అన్నారు. మంగళవారం నార్సింగి మండలం శేరిపల్లిలో ఆర్‌వీఎం ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్య శిబిరం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలను ఆర్‌వీఎం ఆస్పత్రిలో ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లేశం, రమేశ్, భరత్ పాల్గొన్నారు.

ప్రతీ తండాలో సేవాలాల్ జయంతిని నిర్వహించండి

శివ్వంపేట(నర్సాపూర్): సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రతీ గిరిజన తండాలో ఈ నెల 15న ఘనంగా నిర్వహించాలని బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు రవినాయక్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 15న తండాల్లో సేవాలాల్ మహారాజ్ వేడుకలు నిర్వహించడంతో పాటు బోగ్ బండార్ చేపట్టి, మండల కేంద్రం, నర్సాపూర్ పట్టణంలో నిర్వహించే ర్యాలీలో పార్టీలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఆయిల్‌పామ్ సాగు చేయండి

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు ఆయిల్‌పామ్ సాగుచేయాలని లీఫ్‌పామ్ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ కృష్ణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రం కౌడిపల్లి, లింగంపల్లిలో ఆయిల్‌పామ్ పంటల కోసం రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుతో మంచి ఆదాయం ఉంటుందన్నారు. జిల్లాలో 900ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు అవుతుందని, ఉత్సాహం ఉన్న రైతులు ముందుకొస్తే సాగుకు ప్రోత్సహిస్తామని తెలిపారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలు


జాతరలో పాల్గొన్న భక్తులు


నర్సాపూర్ రూరల్: మండలంలోని గొల్లపల్లిలో వెలసిన లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, అభిషేకం, అలంకరణతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఒగ్గు కళాకారుల ప్రదర్శన, బండ్లు బోనాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాళ్లకల్ పంచాయతీ కార్యదర్శిగా ప్రియాంక

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని మేజర్ పంచాయతైన కాళ్లకల్ నూతన పంచాయతీ కార్యదర్శిగా ప్రియాంక బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. కొల్చారం మండలం రంగంపేట పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన ఆమె కలెక్టర్ ఉత్తర్వుల మేరకు కాళ్లకల్‌కు బదిలీపై వచ్చినట్లు చెప్పారు. కాళ్లకల్‌లో పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన రాజు కొల్చారం మండలం రంగంపేటకు బదిలీపై వెళ్లారు.

నాణ్యతకు తూట్లు.. మూణ్నాళ్లకే పగుళ్లు

- నిర్మించిన ఏడాదికే బీటలువారిన గోడలు
- అధ్వానంగా పీహెచ్‌సీ భవనం
- కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం..
- అధికారుల పర్యవేక్షణ లోపం


బీటలువారిన భవనం గోడలు


వాష్‌రూమ్‌కు పట్టని తలుపు గొళ్లెం

అల్లాదుర్గం(మెదక్): నాణ్యతకు తూట్లు పొడుస్తూ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నాసిరకం పనులు చేపట్టడంతో గోడలకు మూన్నాళ్లకే పగుళ్లు వచ్చాయి. అధికారులు పనులు చేపట్టినప్పుడు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో నాణ్యతకు తూట్లు పడ్డాయి. ఇది ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియోజకవర్గంలోని అల్లాదుర్గం పీహెచ్‌సీ భవనం పరిస్థితి.

వాష్‌రూమ్‌లో తలుపులు పట్టడం లేదు

మండల కేంద్రంలో పీహెచ్‌సీలో అదనపు గది నిర్మాణానికి ప్రభుత్వం రూ. 10 లక్షలు మంజూరు చేసింది. భవన నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యత లేని పనులు చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భవనం పూర్తయి ఏడాది గడవక ముందే గోడలు బీటలు వారి, పగుళ్లు వచ్చాయి. గది తలుపులపైన కిటికీకి అద్దాలు పెట్టకుండానే వదిలి వేశారు. మహిళలు వాడే వాష్‌రూమ్ తలుపులు పట్టడం లేదని ఆరోగ్య కేంద్రం సిబ్బంది తెలిపారు. పిల్లర్‌కే బీటలు పడటంతో నిర్మాణం పనులు ఎంత నాసిరకంగా నిర్మించారో తెలుస్తుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నాసిరకం పనులతో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయినట్లు ప్రజలు మండిపడుతున్నారు. ఈ భవనం నిర్మాణంపై పూర్తిస్థాయి విచారణ జరిపి కాంట్రాక్టర్‌కు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మహనీయుడా వందనం!


మృతదేహానికి వందనం చేస్తున్న వైద్య విద్యార్థులు

మెదక్‌జోన్: 'మహనీయుడా వందనం.. నీకు కృతజ్ఞతగా ఉంటాం'' అని వైద్యకళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు చేసిన ప్రతిజ్ఞ ఇది. మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థులు మంగళవారం ప్రాక్టికల్స్ ప్రారంభించే ముందు ఓ మృతదేహాన్ని కళాశాలలో పూలతో అలంకరించారు. తలభాగాన దీపాలు వెలిగించారు. పలురకాల పరీక్షలు చేసేందుకు శవాన్ని ప్రతిభాగం కట్‌చేసి పరీక్షలు జరుపుతారు. కృతజ్ఞతతో ఉంటామంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ రవీంద్రకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి శంకర్, డాక్టర్ జయ, డాక్టర్ అర్చన, డాక్టర్ శాంతా కుమారి, డాక్టర్ శివదయాళ్, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ సుమంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలానికి ఒక మోడల్ 'ఇల్లు'

నర్సాపూర్ నియోజకవర్గ హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్


కౌడిపల్లిలో మోడల్ ఇందిరమ్మ ఇల్లు కోసం ముగ్గువేస్తున్న అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలానికి ఒకటి మోడల్ ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నట్లు నర్సాపూర్ నియోజకవర్గ హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం మండలం కేంద్రం కౌడిపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం సముదాయంలోని పాత ఇందిరమ్మ ఇంటి పక్కన ఖాళీ స్థలంలో మోడల్ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ఎంపీడీఓ శ్రీనివాస్‌తో కలిసి ముగ్గువేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి కోసం రూ. 5లక్షలు మంజూరు చేస్తుందన్నారు. దీనికోసం మోడల్‌గా నిర్మించేందుకు రూ. 5లక్షలతో ఇక్కడ ఇందిరమ్మ ఇంటిని నిర్మించనున్నట్లు చెప్పారు. హాల్, కిచన్, బెడ్‌రూం, వాష్‌రూం, సెప్టిక్‌ట్యాంక్ నిర్మించనున్నట్లు చెప్పారు. ఇందులో ఆరుపిల్లర్లు వేసి అక్కడి నుంచి సిమెంట్ ఇటుకలతో గోడను నిర్మించి స్లాబ్ వేస్తామన్నారు. రూ 5 లక్షలతో ఇందిరమ్మ ఇంటిని నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఖురేషి, నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, కారోబార్ ఎల్లం పాల్గొన్నారు.

డిక్లరేషన్ చేసిన తర్వాతనే ఎన్నికలు


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం డిక్లరేషన్ చేశాకే ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులు యాదగిరి, ర్యాకల శేఖర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని జీడిపల్లిలో తెలంగాణ విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో చేపట్టిన సమగ్ర సర్వేలో కంటే బీసీల తక్కువగా చూపిస్తున్నారని అన్నారు. బీసీలంతా ఐక్యతతో ముందుకు రావాలని, బీసీల సత్తా చూపాలన్నారు. బీసీ రిజర్వేషన్లు తక్కువగా చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, భిక్షపతి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపు


కన్నారంలో గంగమ్మ బోనాల ఊరేగింపు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి, కంచన్‌పల్లి గ్రామాల్లో మల్లన్న జాతర, కన్నారంలో గంగమ్మ, వెంకట్రావ్‌పేటలో రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో దేవతలకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పెద్ద ఎత్తున బోనాలను పోతురాజులు విన్యాసంతో ఊరేగించి దేవతలకు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని వెంకట్రావ్‌పేటలో రేణుకా ఎల్లమ్మ, కన్నారంలో గంగమ్మదేవి జాతరలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ మంగళవారం పాల్గొని దేవతామూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నర్సాపూర్ మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, నాయకులు మైసాగౌడ్, వెంకట్‌గౌడ్, వీరేష్‌గౌడ్, బాలగౌడ్, ప్రవీణ్‌రెడ్డి, కృష్ణ, పోచాగౌడ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కోళ్లు జబ్బు పడితే సమాచారం ఇవ్వండి

నర్సాపూర్: కోళ్ల ఫారాల్లో పెంచుతున్న కోళ్లు జబ్బు పడితే తమ దృష్టికి తేవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ జనార్దన్‌రావు కోరారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కోళ్లకు ఎలాంటి వైరస్ సోకలేదని చెప్పారు. ఇటీవల పశుసంవర్ధక శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి డాక్టర్ వెంకటయ్య నేతృత్వంలో తమ శాఖకు చెందిన వైద్యుల బృందం జిల్లాలో పర్యటించిందని వివరించారు. జిల్లాలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకిన దాఖలాలు లేవని, వైరస్‌పై ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తమ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కోళ్ల ఫారాల్లో పెంచుతున్న కోళ్లు జబ్బు పడితే ఫౌల్ట్రీ ఫాంల యజమానులు వెంటనే తమ దృష్టికి తేవాలని, జబ్బు పడిన కోళ్లను పరీక్షించి తగిన వైద్య సలహాలు ఇస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాపన్నపేట(మెదక్): మండలంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఓ మోహన్ బాబు, ఏఈ నర్సింలు తెలిపారు. వేసవి కాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా మిన్‌పూర్ 33 కేవీ ఫీడర్ పనులు చేపడుతున్నామని చెప్పారు. అందువల్ల సబ్‌స్టేషన్ పరిధిలోని కుర్తివాడ, యూసుఫ్‌పేట, మిన్‌పూర్ గ్రామాలకు ఉదయం 11.30 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు భగీరథ నీటి సరఫరా బంద్

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటతో పాటు అన్ని గ్రామాలకు బుధవారం భగీరథ నీటి సరఫరా ఉండదని మిషన్ భగీరథ డీఈ ప్రవీణ్ తెలిపారు. బోర్పట్లలో పైప్‌లైన్ మరమ్మతుల్లో భాగంగా బుధవారం భగీరథ నీటి సరఫరాలో అంతరాయం నెలకొందన్నారు.

రిజర్వేషన్లు పెంచాలి

కొల్చారం(నర్సాపూర్): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ రిజర్వేషన్లు పెంచేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ కోరారు. మంగళవారం సంగాయిపేట్లో విలేకరులతో మాట్లాడుతూ.. చాలా గ్రామాల్లో ఎస్సీలకు రిజర్వేషన్లు అందడం లేదని, తద్వారా రాజకీయంగా ఎస్సీలు ముందుకు సాగేందుకు అవకాశం రావడం లేదన్నారు. ప్రభుత్వం ఎస్సీలకు న్యాయం చేసేలా రిజర్వేషన్లు పెంచాలని కోరారు.

పాఠశాల భవనం అప్పగింత



నవీన్‌గుప్తాను సన్మానిస్తున్న విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): అసంపూర్తిగా నిలిచిపోయిన పాఠశాల భవనం పూర్తిచేసి అప్పగించినందుకు దాతకు విద్యార్థులు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రం శివ్వంపేటలోని ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో గ్రామవాసి కాంగ్రెస్ నాయకుడు నవీన్‌గుప్తా సుమారు రూ.10 లక్షల నిధులతో పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చారు. మోడల్ పాఠశాల భవనంగా తీర్చిదిద్దినందుకుగాను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నవీన్ గుప్తాని సన్మానించి అభినందించారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేశ్, ప్రభులింగం, అంజయ్య, గౌరీశంకర్, మల్లేశ్, అచారి, దావుద్, వెంకటేష్, శ్రీనివాస్, ఆలీ తదితరులు ఉన్నారు.

నిషేధించిన ప్లాస్టిక్ వాడితే చర్యలు


దుకాణ యజమానికి జరిమానా నోటీసు అందిస్తున్న మున్సిపల్ అధికారులు

నర్సాపూర్: ఏక వినియోగ ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తీసుకుంటామని మున్సిపాలిటీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న పలువురు వ్యాపారులకు జరిమానా విధించినట్లు వారు చెప్పారు. నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని, విక్రయించొద్దని వారు సూచించారు. కాగా జ్యూస్ సెంటర్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో దుకాణం యజమానికి జరిమానా విధించినట్లు వారు వివరించారు. వారి వెంట వార్డు ఆఫీసర్లు ఉదయ్‌కుమార్, రాములుతో పాటు తదితరులు ఉన్నారు.

మండలంలో 282 పోలింగ్ కేంద్రాలు


నర్సాపూర్: పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ మధులత, ఇతర సిబ్బంది

నర్సాపూర్: మండలంలో గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల కోసం 282 పోలింగ్ కేంద్రాలు ప్రతిపాదనలు తయారు చేసి, ప్రదర్శనకు పెట్టినట్లు ఎంపీడీఓ మధులత చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని 35 గ్రామ పంచాయతీలు, వాటి పరిధిలోని వార్డుల కోసం పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు తయారు చేశామని, ప్రతీ వార్డుకు ఒక పోలింగ్ స్టేషన్ ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల వివరాలు తమ కార్యాలయంలో ప్రదర్శనకు పెట్టామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 13 వరకు తమ కార్యాలయంలో అందజేయాలని ప్రజలను కోరారు. ప్రతిపాదిత పోలింగ్ స్టేషన్లపై ఎలాంటి అభ్యంతరాలు రాని పక్షంలో ప్రస్తుతం ప్రతిపాదించిన వాటిని ఈనెల 15న పోలింగ్ కేంద్రాలుగా ఖరారు చేస్తామని చెప్పారు. కాగా ఎంపీటీసీ స్థానాల ఎన్నికల కోసం మండలంలో 58 పోలింగ్ కేంద్రాలు ప్రతిపాదించినట్లు వివరించారు. ఆమె వెంట ఎంపీఓ శ్రీనివాస్, ఆఫీసు సూపరింటెండెంట్ మనోహర్ తదితరులు ఉన్నారు.

పశువుల దొంగలు అరెస్ట్

చేగుంట(తూప్రాన్): పశువుల దొంగలను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 7న మాసాయిపేట మండలం రామాంతపూర్ గ్రామానికి చెందిన స్వామి అనే రైతుకు చెందిన 5 పశువులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, మంగళవారం అనుమానస్పదంగా తిరుగుతున్న వాహనాన్ని తనిఖీ చేసి వారిని విచారించారు. పలు మండలాల్లో పశువులను అపహరించినట్లు ఒప్పుకోవడంతో పాటు రామాంతపూర్‌లో 5 పశువులను దొంగిలించినట్లు అంగీకరించారు. దీంతో హైదరాబాద్‌కు చెందిన రఫీయుద్దీన్, నవాబుద్దీన్‌లను అదుపులోకి తీసుకొని, కారును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటే

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సొంత నియోజవర్గంలో జరుగుతున్న గ్రాడ్యుయెట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని పెట్టకుండా బీజేపీతో లోపాయికారి ఒప్పందం చేసుకుందని నార్సింగి మండల కాంగ్రెస్ నాయకుడు రాజేశ్ ఆరోపించారు. మంగళవారం నార్సింగిలో ఆయన మాట్లాడుతూ.. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీజేపీ ఎంపీ అభ్యర్థులను గెలిపించేందుకే సామర్థ్యంలేని అభ్యర్థులను తెరపైకి తెచ్చిందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌సెల్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బాచి, సుధాకర్, చందు, శంకర్‌నాయక్ ఉన్నారు.

◆ వైభవంగా దుర్గమాత ఆలయ ఉత్సవాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని జంగరాయి గ్రామంలో వెలసిన దుర్గమాత ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం దుర్గమాత అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నవగ్రహ పూజలు, గణపతి హోమం చేశారు. ఈ కార్యక్రమంలో అంజిరెడ్డి, సంజీవరెడ్డి, దుర్గారెడ్డి, చంద్రారెడ్డి, బాగారెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.

◆ ఉపాధ్యాయుడి మృతికి సంతాపం



రామాయంపేట(మెదక్): ఉపాధ్యాయుడి మృతికి సంతాప సూచకంగా మండలంలోని కాట్రియాలలో గ్రామస్తులు జెడ్పీ స్కూలును మూసివేసి సంతాపం ప్రకటించారు. పాఠశాలలో పనిచేస్తున్న సలావుద్దీన్ అనే ఉపాధ్యాయుడు సోమవారం తొనిగండ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈమేరకు స్కూలులో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు పూలమాలలు వేసి, నివాళులర్పించి మౌనం పాటించారు. అనంతరం పాఠశాలలను మూసివేశారు.

◆ మల్లికార్జునస్వామికి పూజలు

రామాయంపేట(మెదక్): పట్టణంలో మల్లికార్జున స్వామికి జాతర కొనసాగుతోంది. మంగళవారం ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పద్మరెడ్డి ఆలయంలో పూజలు నిర్వహించారు.

◆ డైట్‌లో సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం



హవేళిఘణాపూర్(మెదక్): హవేళిఘణాపూర్ డైట్ కళాశాలలో మంగళవారం జిల్లా ఇన్ఫర్మెటిక్ ఆఫీసర్ చందనప్రియ ఆధ్వర్యంలో మంగళవారం మెదక్ డైట్ కళాశాలలో ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సంవత్సరం మెరుగైన ఇంటర్నెట్ కోసం కలిసి అనే థీమ్‌తో 11 ఫిబ్రవరి 2025న సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవాన్ని జరుపుకున్నామని వివరించారు. కార్యక్రమంలో రవితేజ, రాఘవ, రామ్‌చరణ్, కళాశాల ప్రిన్సిపాల్ హారీఫ్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ నేడు శివ పార్వతుల కల్యాణోత్సవం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలోని హరిహర మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం శివ పార్వతుల కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని గురుస్వామి గణేశ్‌గౌడ్ కోరారు.

ఎంపీటీసీల ఓటరు జాబితా ప్రదర్శన


ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ ఆనంద్


చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట(మెదక్): ఎంపీటీసీ స్థానాల ఓటరు జాబితాను మండల పరిషత్ కార్యాయంలో ఎంపీడీఓ దామోదర్ ప్రకటించారు. మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు, ఎంపీటీసీ కేంద్రాల వారీగా ఓటరు జాబితాను ప్రకటించామన్నారు. మండలంలో మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలకు 65 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 31,470 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.

నార్సింగిలో ఐదు మంది

నార్సింగి మండలంలో ఐదు ఎంపీటీసీ స్థానాలకు ఓటరు జాబితాను ఎంపీడీఓ ఆనంద్ ప్రకటించారు. ఇందులో నార్సింగి-1లో 2883, నార్సింగి-2లో 2909, నర్సంపల్లిలో 2543, జప్తిశివనూర్‌లో 3425, శేరిపల్లిలో 1744 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం 13,504 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.

చేగుంటలో 12 మంది

చేగుంట(తూప్రాన్): మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలను గుర్తించినట్లు ఎంపీడీఓ చిన్నారెడ్డి తెలిపారు. సంబంధిత ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన వివరాలను ఎంపీడీఓ వెల్లడించారు. 12 ఎంపీటీసీ స్థానాల్లో 71 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటిలో 32,335 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

65 పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం 65 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా అన్నారు. పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ముసాయిదా జాబితాను మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రదర్శనకు పెట్టారు. 12 ఎంపీటీసీలకు ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో పోలింగ్‌స్టేషన్ ఉండేలా జాబితా తయారు చేశామన్నారు. ఇందులో అభ్యంతరాలుంటే ఈ నెల 13న ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఆల్ పార్టీ సమావేశంలో చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి ఉన్నారు.

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండలంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితా విడుదల చేసి మంగళవారం నోటీస్ బోర్డుపై పెట్టినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ చెప్పారు. ఓటర్ లీస్టులో పేర్లు లేకుంటే ఏవైన తప్పులుంటే ఓటర్లు తెలుసుకోచ్చన్నారు. ఎంపీటీసీల వారీగా ఓటర్ల జాబితా ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రం చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీ ఓటరు జాబితా ప్రదర్శిచామని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుందని, అందులో భాగంగానే ఓటరు జాబితా ప్రదర్శనలో ఉంచామన్నారు. మండలంలో మొత్తంగా 17675 మంది ఓటర్లు ఉన్నారన్నారు. రానున్న ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు.